## క్లుప్తంగా

### విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

**నెల్లూరు సిటీ:** విద్యుత్ సమస్యలు తలెత్తిన ప్పుడు వేగవంతంగా పరిష్కరించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాల యంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎస్‌ఈ విజయన్, ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, డీఈలు అశోక్, భానునాయక్, మధుసూదన్‌రెడ్డి, కిరణ్, ఏఈలు రాజా బాబు, శ్రీలక్ష్మి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

### 14 వరకు చైతన్య ఉద్యమం


మాట్లాడుతున్న సుబహాన్

**నెల్లూరు(బారకాసు):** రాజ్యాంగ చైతన్యంపై అవగాహన కల్పించే నిమిత్తం ఉద్యమాన్ని సెప్టెంబర్ 14 వరకు నిర్వహించనున్నామని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు సుబహాన్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిలానీబాషా, చంద్ర, వాహిద్, షబ్బీర్, హుస్సేన్, నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

### వరద సహాయక చర్యల్లో పారిశుధ్య కార్మికులు




**నెల్లూరు(బారకాసు):** విజయవాడలోని వరద ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు గానూ 116 మంది పారిశుధ్య కార్మికులు, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, పది మంది మేస్త్రీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బుధవారం తరలివెళ్లారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణం నుంచి బస్సులను అదనపు కమిషనర్ శర్మద, ఎంహెచ్‌ఓ చైతన్య ప్రారంభించారు.

### ఉపాధ్యాయులకు సత్కారం



**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను దివ్యాంగుల ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు జోగేంద్రనాథ్, కృష్ణ, విజయ, హరిని సన్మానించారు. బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, జక్కావుల్లా, గుమ్మడి శీనయ్య పాల్గొన్నారు.

### కుక్కల బెడద నుంచి కాపాడరూ..


వెటర్నరీ వైద్యుడికి వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్లు

**నెల్లూరు(బారకాసు):** నగరంలో కుక్కల స్వైరవిహారం నానాటికీ అధికమవుతోందని, వీటి బెడద నుంచి ప్రజలను కాపాడాలని 14, 16వ డివిజన్ల కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, వేనాటి శ్రీకాంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు.

### సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వాకాటి నారాయణరెడ్డి

**నెల్లూరు(బారకాసు):** ప్రతి ఇంట్లో బీజేపీ సభ్యుడు ఉండేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి కోరారు. మినీబైపాస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నేతలు రాజేశ్వరి, పెంచలయ్య, రాజేష్, విజయ్‌కుమార్, యశ్వంత్‌సింగ్, పరశురామ్, ప్రసాద్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# నేత్రదానంపై అవగాహన అవసరం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆనంద్ తదితరులు


మాట్లాడుతున్న శర్వాణి

- కలెక్టర్ ఆనంద్

**నెల్లూరు(దర్గామిట్ట):** నేత్రదానంపై అవగాహన కలిగి అంధత్వ నివారణకు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను నగరంలోని తన చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నేత్రదాన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. జిల్లా అంధత్వ నివారణాధికారి శర్వాణి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, శ్రీనివాసరావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

**అవగాహన సదస్సు**

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని వేదాయపాళెంలోని చైతన్యపురిలో గల దుర్గా కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో నేత్రదానంపై అవగాహన సదస్సును జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ శర్వాణి మాట్లాడారు. నేత్రదానంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని కోరారు. దుర్గారెడ్డి, న్యాయసేవాధికార సంస్థ సభ్యులు శ్రీనివాసరావు, సుబ్బారావు, మహబూబ్‌బాషా, పీహెచ్‌పీ నేతలు వేణుగోపాల్, శ్రీనివాసులు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## అయ్యో.. శిశువు

- ఆర్టీసీ బస్టాండ్‌లో వదిలేసిన తల్లి
- శిశుగృహకు అప్పగింత


శిశుగృహ మేనేజర్‌కు అప్పగిస్తున్న అధికారులు

**నెల్లూరు సిటీ:** మూడు నెలల వయస్సున్న శిశువును ఆర్టీసీ బస్టాండ్‌లో తల్లి మంగళవారం రాత్రి వదిలేశారు. దీనిపై శిశుగృహ మేనేజర్‌కు ఆర్టీసీ అధికారులు సమాచారమిచ్చారు. సీసీ కెమెరాలను పరిశీలించగా, శిశువును ఓ మహిళ వదిలి వెళ్లారని గుర్తించారు. శిశువును డీసీపీయూ ఉద్యోగులు సుమత, శైలజ శిశుగృహానికి తీసుకెళ్లారు. ఘటనపై చిన్నబజార్ పోలీసులకు గృహ మేనేజర్ పెంచలలక్ష్మి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**జడ్జి తనిఖీలు**

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):** దర్గామిట్టలోని శిశు గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి వాణి తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో వదిలేసిన శిశువుతో పాటు అక్కడ ఉన్న అనాథ పిల్లలను పరామర్శించారు. సదుపాయాలు ఏ విధంగా అందుతున్నాయననే అంశాన్ని ఆరాతీశారు. ఏ అవసరమొచ్చినా 15100, 0861 2330579 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీసీపీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'డీకేడబ్ల్యూ'లో అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న భానుప్రసాద్

**నెల్లూరు (టౌన్):** యాంత్రిక జీవన విధానంలో ఆహార అలవాట్లు మానవ మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతాయని న్యూయార్క్‌కు చెందిన కెమిస్ట్ ప్రెసిడెంట్ భానుప్రసాద్ పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్ ఇన్ ఫుడ్ న్యూట్రీషియన్ అండ్ బయో ప్రొడక్ట్స్, అడ్వాన్సింగ్ హెల్త్ త్రూ ఇన్నోవేషన్ అనే అంశంపై నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో సదస్సును కామర్స్, బయోటెక్నాలజీ, హోమ్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీ విటమిన్ లోపంతో ప్రస్తుతం అనేక మంది బాధపడుతున్నారని చెప్పారు. మహిళల్లో బీపీ, కొలెస్ట్రాల్, షుగర్, అల్సర్ తదితర వ్యాధులకు ఆహారంలో వచ్చిన మార్పులే ప్రధాన కారణమని తెలిపారు. వీఎస్‌యూ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ మేరీ సందీప్, అన్విత లైఫ్ కేర్ ఇండస్ట్రీ డైరెక్టర్ హితేష్‌కుమార్, ప్రిన్సిపల్ గిరి, ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, కన్వీనర్ విజయభాస్కర్, కో కన్వీనర్లు ప్రియాంక, కళాప్రియ పాల్గొన్నారు.

# దాడులు చేయడం తగదు

**నెల్లూరు సిటీ:** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరిబాబుపై ఐదుగురు వ్యక్తులు మంగళవారం దాడికి పాల్పడటం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి దాడులకు పాల్పడటం తగదని హితవు పలికారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఇలాంటి దాడులు చేస్తే ప్రజలు బుద్ధి చెప్పే రోజు త్వరలోనే వస్తుందని చెప్పారు. ఇలాంటి ఘటనలకు తమ పార్టీ శ్రేణులు భయపడబోరని స్పష్టం చేశారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని, ఎవరూ ఆందోళనకు గురికావొద్దని భరోసా ఇచ్చారు.

# అంతా ఇష్టారాజ్యం


మాగుంట లేఅవుట్లోని ఎన్టీఆర్ పార్కు వద్ద రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

- పార్కుల ఎదుట దుకాణాలు
- సందర్శకులకు అడ్డంకిగా మారుతున్న వైనం
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

**నెల్లూరు(బారకాసు):** మినీబైపాస్ రోడ్డులోని అన్నమయ్య సర్కిల్, మాగుంట లేఅవుట్లో గల పార్కుల ఎదుట దుకాణాలను విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. ఈ పార్కుల ముందు ఫుట్‌పాత్‌లపై కొందరు పలు రకాలు దుకాణాలను ఏర్పాటు చేసి రాత్రి వరకు తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇందులో తినుబండారాలకు సంబంధించిన బండ్లను ఏర్పాటు చేసి ప్రక్రియను కొనసాగిస్తున్నారు. పార్కు ఎదుట వాహనాలను నిలపడంతో రద్దీ ఏర్పడుతోంది. ఇంత జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## పీహెచ్‌సీలో తనిఖీలు



**నెల్లూరు(వీఆర్సీ సెంటర్):** నగరంలోని చాకలివీధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి ఖాదర్‌వలీ ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రాంతాల్లో క్షయ నిర్ధారణ పరీక్షలను పది శాతం మేర నిర్వహించాలని సూచించారు. బీసీజీ టీకాలు వేయించుకున్న వారిని ప్రతి సోమవారం పరీక్షించాలని కోరారు. వైద్యాధికారి గీతాంజలి, కమ్యూనిటీ ఆర్గనైజర్ తిరుపతమ్మ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.







## సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

**నెల్లూరు సిటీ:** కలివెలపాళెం సర్పంచ్ పార్లపల్లి మధుసూదన్‌రెడ్డి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీఓ సుస్మిత ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. ఆయనపై పలు ఆరోపణలు రావడంతో ఈ మేరకు చర్యలు చేపట్టామని చెప్పారు.

## ఉపాధ్యాయులకు ఉచిత వైద్య పరీక్షలు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉపాధ్యాయులకు ఉచిత వైద్య పరీక్షలను గురువారం నుంచి నెల పాటు ఉచితంగా నిర్వహించనున్నామని ఆస్పత్రి హెడ్ ధీరజ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. రూ.5830 విలువజేసే 25 రకాల వైద్య పరీక్షలతో పాటు కార్డియాలజీ, గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్ కన్సల్టేషన్‌ను ఉచితంగా అందిస్తామని చెప్పారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైద్యులు బిందురెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ సతీష్, పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితుల సహాయార్థం విరాళం

**నెల్లూరు సిటీ:** విజయవాడలో వరద బాధితుల సహాయార్థం జిల్లాలోని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ఉద్యోగులు రూ.1.93 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయనిధికి పంపామని నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్స్, స్టాంపుల శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను రూ.25 వేలను పంపానని చెప్పారు.

## పాఠశాలల పరిశుభ్రతను పర్యవేక్షించాలి

**కొడవలూరు :** పాఠశాలల పరిశుభ్రతతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా ఎస్‌ఎంసీ చైర్మన్ల పర్యవేక్షణ ఉండాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్యంపై హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, వెల్ఫేర్ సహాయకులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్న చైర్మన్‌లు బాధ్యతగా వ్యవహరిస్తూ పిల్లలకు నాణ్యమైన భోజనం, పాఠశాలల్లో పారిశుద్ధ్య మెరుగునకు కృషి చేయాలని కోరారు. ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ ఎస్‌ఎంసీ చైర్మన్‌లు పాఠశాలల్లో పారిశుద్ధ్యాన్ని మంగళ, గురువారాల్లో పరిశీలించడంతో పాటు ఫొటోలను వారికి కేటాయించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

## ఇంటర్వ్యూలు నేడు

**నెల్లూరు(బారకాసు):** ఐటీఐ కోర్సును పూర్తి చేసిన నిరుద్యోగులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను కొత్తూరు సమీపంలోని ఎస్సార్ ఆర్ ఐటీఐ కళాశాలలో గురువారం నిర్వహించనున్నామని కరస్పాండెంట్ రెహమాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల్గేట్ పామోలివ్ కంపెనీలో టెక్నీషియన్ల పోస్టుల కోసం ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని, ఏడాది పాటు శిక్షణ అనంతరం రెగ్యులర్ చేయనున్నారని వివరించారు. శిక్షణ కాలంలో స్టయ్‌ఫండ్ రూపంలో నెలకు రూ.14,500 మేర అందజేయనున్నారని చెప్పారు. పదో తరగతి మార్కుల లిస్ట్, ఐటీఐ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకురావాలని, వివరాలకు 97039 67967 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్న ఘాట్‌లో ట్రాన్స్‌ఫార్మర్, పోళ్లను ఏర్పాటు చేయనున్న క్రమంలో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్, బట్వాడిపాళెం తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

## నేటి నుంచి మట్టి ప్రతిమల పంపిణీ

**నెల్లూరు(బృందావనం):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను గురువారం నుంచి ఉచితంగా పంపిణీ చేయనున్నామని శ్రీపతి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ సమీపంలోని వెంకట్రామా షాపీ మిద్దెపైన ఉదయం 10.30 నుంచి 11.30 వరకు అందజేయనున్నామని చెప్పారు.